సాక్షి
సూర్యాపేట
బుధవారం । 27 । నవంబర్ । 2024



120 కిలోల డ్రగ్స్ పట్టివేత
సీజ్ చేసిన కంపెనీలో డ్రగ్స్ తయారు చేసి తరలిస్తున్న ముఠాను పోలీసులు మంగళవారం అరెస్ట్ చేశారు.
- 8లో



పోటెత్తిన 'తెల్ల బంగారం'
శాలిగౌరారం మండలంలోని మాధారం కలాన్ సీసీఐ కొనుగోలు కేంద్రానికి పత్తి పోటెత్తుతోంది.
- 8లో



విద్యారంగం బలోపేతానికి..
సీఎం రేవంత్‌రెడ్డి ఏర్పాటు చేసిన విద్యా కమిషన్‌కు తోడ్పాటునందిస్తామని కమిషన్ చైర్మన్ ఆకునూరి మురళి తెలిపారు.
- 10లో

న్యూస్‌రీల్

నెట్ బ్యాంకింగ్ లావాదేవీలపై జాగ్రత్త వహించాలి

సూర్యాపేట : ఇంటర్నెట్ బ్యాంకింగ్ లావాదేవీలపై జాగ్రత్త వహించాలని ఎస్‌బీఐ నల్లగొండ జిల్లా ఏఓ, డీజీఎం వినోద్‌కుమార్ సింహ అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని కిరాణం ఫ్యాన్సీ మర్చంట్‌లో ఎస్‌బీఐ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. వ్యక్తిగత వివరాలు, ఓటీపీ నంబర్లను అపరిచితులకు తెలియజేయవద్దన్నారు. తరచూ పాస్‌వర్డ్ మార్చాలని, ఐడీ పాస్‌వర్డ్, పిన్ బహిర్గతం చేయవద్దన్నారు. అపరిచితులు పంపించే యాప్‌లను డౌన్‌లోడ్ చేసుకోవద్దన్నారు. మనకు తెలియకుండానే ఏవైనా లావాదేవీలు జరిగితే వెంటనే 1930 సైబర్ క్రైమ్ నంబర్‌కు సమాచారం అందజేయాలన్నారు. ఈ కార్యక్రమంలో రీజనల్ మేనేజర్ వై.ఉపేందర్ భాస్కర్, పెన్షనర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు కేతిరెడ్డి రంగారెడ్డి, సెక్రటరీ ఎస్‌కె అబ్దుల్లా, బ్యాంకు ఖాతాదారులు, సిబ్బంది పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి



మాట్లాడుతున్న జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి శ్రీవాణి

చివ్వెంల(సూర్యాపేట) : విద్యార్థులు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి పి.శ్రీవాణి అన్నారు. రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా మంగళవారం సూర్యాపేట పట్టణంలోని బాలికల పాలిటెక్నిక్ కళాశాలలో నిర్వహించిన కార్యక్రమంలో ఆమె పాల్గొని మాట్లాడారు. మహిళల కోసం ఏర్పాటు చేసిన ప్రత్యేక చట్టాలను వివరించారు. రాజ్యాంగం పట్ల ప్రతిఒక్కరూ గౌరవంగా ఉండాలన్నారు. ఈ సందర్భంగా అంబేద్కర్ చిత్రపటానికి శ్రీవాణి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు నూకల సుదర్శన్‌రెడ్డి, ఏజీపీ కోణం రఘురామయ్య, డిఫెన్స్ కౌన్సిల్ సభ్యులు వసంత సత్యనారాయణ పిళ్లే యాదవ్, బొల్లెద్దు వెంకటరత్నం, పెండెం వాణి, జె.శశిధర్, హుస్సేన్, ఏడిండ్ల అశోక్, బాలకృష్ణ, ప్రిన్సిపాల్ సుజాత, వైస్ ప్రిన్సిపాల్ వజ్రయ్య పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణను అడ్డుకుంటే సహించేది లేదు

సూర్యాపేట : మాదిగ, మాదిగ ఉప కులాలకు రాజ్యాంగ ఫలాలు అందించేందుకు సుప్రీంకోర్టు ఎస్సీ వర్గీకరణ తీర్పు ఇచ్చిందని, ఎవరైనా అడ్డుకుంటే సహించేది లేదని టీ ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు ఇటుక రాజుమాదిగ అన్నారు. మంగళవారం స్థానికంగా ఓ ఫంక్షన్ హాల్‌లో ఏర్పాటు చేసిన టీఎమ్మార్పీఎస్ విజయోత్సవ సభలో ఆయన పాల్గొని మాట్లాడారు. సుప్రీంకోర్టు తీర్పును మాలలు వ్యతిరేకిస్తే.. అంబేద్కర్‌ను, రాజ్యాంగాన్ని అవమానించడమే అన్నారు. చెన్నూరు ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామి డబ్బు, హోదాతో మాలలను ఉసిగొల్పుతూ ఎస్సీ వర్గీకరణ అడ్డుకునే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు. ముందుగా ఖమ్మం క్రాస్ రోడ్డు అంబేద్కర్ విగ్రహం వద్ద టీ ఎమ్మార్పీఎస్ జెండాను ఆవిష్కరించి భారీ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో రాష్ట్ర అధ్యక్షుడు సిరసనోళ్ల బాలరాజు, వర్కింగ్ ప్రెసిడెంట్ గుండా రమేష్, టీ ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు కత్తి ఉపేందర్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బాషపంగు సత్యం, రాష్ట్ర ఉపాధ్యక్షుడు పాలడుగు జానయ్య, గండి బాలరాజు, రామస్వామి, వెంకన్న, జంగయ్య, మామిడి సైదులు, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

పంచముఖ ఆంజనేయుడికి పంచామృతాభిషేకం



మేళ్లచెరువు ఆలయంలో పండ్లతో ప్రత్యేకంగా అలంకరించిన పంచముఖ ఆంజనేయస్వామి మూలవిరాట్

ఉద్యమ స్ఫూర్తి చాటేలా..

29న బీఆర్ఎస్ దీక్షా దివస్
- పెద్ద ఎత్తున నిర్వహించాలని ఆ పార్టీ నిర్ణయం
- మూడు జిల్లాల్లో విస్తృతస్థాయి సమావేశాలు
- హాజరైన మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి
- ఏడాదిపాలన తర్వాత ప్రభుత్వంపై పోరుబాటకు కార్యాచరణ



సూర్యాపేటలో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి, చిత్రంలో కిశోర్

సాక్షి ప్రతినిధి, నల్లగొండ : తెలంగాణ రాష్ట్ర సాధన కోసం బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ దీక్ష చేపట్టిన రోజును పురస్కరించుకొని ఉమ్మడి నల్లగొండ జిల్లాలో పెద్ద ఎత్తున దీక్షా దివస్ నిర్వహించాలని బీఆర్ఎస్ నిర్ణయించింది. నల్లగొండ, సూర్యాపేట, యాదాద్రి జిల్లాల్లో ఈ కార్యక్రమాలను పెద్ద ఎత్తున నిర్వహించబోతోంది. మూడు జిల్లాల్లో మంగళవారం ఆ పార్టీ విస్తృతస్థాయి సమావేశాలను నిర్వహించింది. ఈ సమావేశాల్లో మాజీ మంత్రి గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి పాల్గొని దిశా నిర్దేశం చేశారు. ఈనెల 29వ తేదీన దీక్షా దివస్‌ను విజయవంతం చేసి.. కాంగ్రెస్ ఏడాదిపాలన పూర్తయ్యాక ప్రభుత్వ వైఫల్యాలపై ప్రత్యేక కార్యాచరణతో పోరుబాట పట్టేలా బీఆర్ఎస్ సిద్ధమవుతోంది.

కేసీఆర్ పోరాటం తెలిసేలా..

నేటి యువతకు నాటి ఉద్యమ తీరును తెలియజేసి వారిలో స్ఫూర్తి నింపేలా దీక్షా దివస్‌ను నిర్వహించాలని ఉమ్మడి జిల్లా బీఆర్ఎస్ నిర్ణయించింది. నాటి ఉద్యమ తీరు తెన్నులను, కేసీఆర్ కృషిని నేటి యువత కళ్లముందుంచేలా ఈ కార్యక్రమాన్ని చేపట్టాలని నిర్ణయించింది. 2009 నవంబర్ 29వ తేదీన కేసీఆర్ దీక్షను చేపట్టి తెలంగాణ మలి దశ ఉద్యమాన్ని ఎలా మలుపుతిప్పారు.. రాష్ట్ర సాధనకు ఎలాంటి ఎత్తుగడలతో ముందుకు సాగారు.. డిసెంబర్ 9న ప్రకటన వచ్చేలా ఎలా వ్యూహాన్ని అమలు చేశారన్న అంశాలను యువతకు తెలియజెప్పేలా ఈ కార్యక్రమాన్ని నిర్వహించేందుకు నల్లగొండ, సూర్యాపేట, యాదాద్రి జిల్లా కేంద్రాల్లో పెద్ద ఎత్తున ఏర్పాట్లు చేయాలని నిర్ణయించింది. ఈ కార్యక్రమానికి జిల్లాలోని ప్రతి గ్రామం నుంచి యువత కదిలి వచ్చేలా చర్యలు చేపట్టాలని మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి దిశా నిర్దేశం చేశారు.

ప్రత్యేక కార్యక్రమాలు, ఫొటో ప్రదర్శనలు

దీక్ష దివస్ సందర్భంగా మూడు జిల్లా కేంద్రాల్లో, పార్టీ కార్యాలయాల్లో నాటి ఉద్యమానికి కేసీఆర్ ఊపిరిలూదిన తీరుపై ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించాలని నిర్ణయించింది. అలాగే కేసీఆర్ చేసిన ఉద్యమం, దీక్ష, తరువాత జరిగిన పరిణామాలు, తెలంగాణ రాష్ట్ర సాధన తీరును వివరించేలా పెద్ద ఎత్తున ఫొటో ప్రదర్శనను నిర్వహించాలని, నాటి ఉద్యమ తీరుతెన్నులు కళ్ల ముందుండేలా ఉద్యమ జ్ఞాపకాలను ఆవిష్కరించేలా కార్యక్రమాలకు రూపకల్పన చేస్తోంది. అలాగే సీఎంగా కేసీఆర్ ప్రజలకు అందించిన పాలన, సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను యువతకు వివరించేలా చర్యలు కార్యక్రమాలు చేపట్టాలని నిర్ణయించింది.

ప్రభుత్వ వైఫల్యాలపై పోరాడుతాం

ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో ప్రజలకు ఎదురవుతున్న సమస్యలపై మాత్రమే ఇప్పుడు మాట్లాడుతున్నాం. ప్రభుత్వ వైఫల్యాలపై పార్టీ పరంగా ఇప్పటి వరకు కార్యాచరణ తీసుకోలేదు. కొత్త ప్రభుత్వానికి ఏడాది గడువు ఇవ్వాలన్న విజ్ఞత మాకుంది. కేసీఆర్ అదే చెప్పారు. మాజీ సీఎం కేసీఆర్ ప్రభుత్వంపై ఒక్క మాట కూడా మాట్లాడటం లేదు. ఏడాది పాలన పూర్తయ్యాక ప్రభుత్వ వైఫల్యాలపై పోరాట కార్యక్రమాలను చేపడతాం.

– మాజీ మంత్రి గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి

దీక్షా దివస్‌ను ఘనంగా నిర్వహించాలి

సూర్యాపేటటౌన్ : దీక్షా దివస్ ఘనంగా నిర్వహించాలని సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి పిలుపునిచ్చారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని బీఆర్ఎస్ కార్యాలయంలో జిల్లా జనరల్ బాడీ సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ఉద్యమ చరిత్రలో మరువలేని రోజు నవంబర్ 29 అని.. అలాంటి రోజును ఘనంగా జరుపుకుందామన్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో విలన్ పాలన నడుస్తోందని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వంపై ప్రజల్లో తిరుగుబాటు మొదలైందని, రాబోయేది మళ్లీ కేసీఆర్ పాలనేనని, ప్రజలందరి ఆశీర్వాదంతో కేసీఆర్ మళ్లీ సీఎం కావడం ఖాయమన్నారు. దీక్ష దివస్ రోజు కేసీఆర్ దీక్షకు సంబంధించిన ఫొటో ప్రదర్శన చేయాలని, తెలంగాణ ఉద్యమ జ్ఞాపకాలను ఆవిష్కరించాలన్నారు. ముందుగా రాజ్యాంగం దినోత్సవం సందర్భంగా డాక్టర్ బీఆర్ అంబేద్కర్, మహాత్మాగాంధీ చిత్రపటాలకు పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో జెడ్పీ మాజీ చైర్మన్ బండా నరేందర్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు గాదరి కిశోర్ కుమార్, బొల్లం మల్లయ్యయాదవ్, రవీంద్రకుమార్, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు బడుగుల లింగయ్య యాదవ్, ఒంటెద్దు నరసింహారెడ్డి, చెరుకు సుధాకర్, వై.వెంకటేశ్వర్లు, మున్సిపల్ చైర్మన్ అన్నపూర్ణ, మాజీ జెడ్పీ చైర్‌పర్సన్ గుజ్జ దీపిక, నిమ్మల శ్రీనివాస్‌గౌడ్, గోపగాని వెంకటనారాయణ గౌడ్, మారిపెద్ది శ్రీనివాస్‌గౌడ్, దావుల వీరప్రసాద్‌యాదవ్, ఎస్‌ఏ రజాక్ తదితరులు పాల్గొన్నారు.

నీటి సంరక్షణ ప్రతిఒక్కరి బాధ్యత

- కలెక్టర్ తేజస్ నంద్‌లాల్ పవార్

నూతనకల్ : భవిష్యత్ తరాల కోసం నీటిని సంరక్షించే బాధ్యత ప్రతిఒక్కరిపై ఉందని కలెక్టర్ తేజస్ నంద్‌లాల్ పవార్ అన్నారు. మంగళవారం నూతనకల్ మండల కేంద్రంలోని శంభుని చెరువు ఆవరణలో నిర్వహించిన సరోవర్ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. నీటిని సంరక్షించాలనే ఉద్దేశంతో ప్రధాని మోదీ అమలు చేస్తున్న అమృత సరోవర్ పథకంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ చెరువులు, కుంటలను కాపాడాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. రాజ్యాంగ దినోత్సవాన్ని పురస్కరించుకుని మహిళా సంఘం సభ్యులతో, ప్రజలతో ప్రతిజ్ఞ చేయించారు. ఇందిరా మహిళా శక్తి–ఉపాధి హామీ భరోసా పథకంలో జరిగే పనుల గురించి వివరించారు. ఉపాధి హామీలో 100 రోజులు పని చేసిన వారిని, జీపీ మల్టీపర్పస్ వర్కర్స్‌ను సన్మానించారు. అనంతరం ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆకస్మికంగా పరిశీలించారు. ట్యాబ్ ఎంట్రీ వేగంగా చేయాలని ఆదేశించారు. మిల్లింగ్ ఎంట్రీలు సకాలంలో చేయాలని సూచించారు. కొనుగోలు జరిగిన వెంటనే మిల్లులకు ధాన్యం రవాణా చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో తుంగతుర్తి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ తీగల గిరిధర్‌రెడ్డి, పీఏసీఎస్ చైర్‌పర్సన్ నాగం జయసుధసుధాకర్‌రెడ్డి, తహసీల్దార్ శ్రీనివాస్, ఎంపీడీఓ సునిత, ఏఓ మురళీధర్, ఏపీఎం కమలాకర్ తదితరులు పాల్గొన్నారు.

కలెక్టరేట్‌లో రాజ్యాంగ దినోత్సవం

భానుపురి (సూర్యాపేట) : కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో మంగళవారం రాజ్యాంగ దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ తేజస్ నంద్‌లాల్ పవార్ సమక్షంలో అధికారులు ప్రతిజ్ఞ చేశారు. అదనపు కలెక్టర్ పి.రాంబాబు, చకిలం రాజేశ్వరరావు, సత్యనారాయణ, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

1,01,019 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు

భానుపురి (సూర్యాపేట) : జిల్లాలో 314 కొనుగోలు కేంద్రాల ద్వారా ఇప్పటి వరకు 1,01,019 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేశామని కలెక్టర్ అన్నారు. ధాన్యం కొనుగోళ్లపై వివిధ జిల్లాల కలెక్టర్లతో సీఎం రేవంత్‌రెడ్డి ఢిల్లీ నుంచి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ తేజస్ నంద్‌లాల్ పవార్ మాట్లాడుతూ 10,121 మంది రైతులకు రూ.145 కోట్లను ఖాతాల్లో జమ చేశామన్నారు.

28న సైన్స్ సంబరాలు

జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో ఈ నెల 28న నిర్వహించే జిల్లాస్థాయి చెకుముకి సైన్స్ సంబరాలు వాల్‌పోస్టర్‌ను డీఈఓ అశోక్‌తో కలిసి కలెక్టర్ ఆవిష్కరించారు. జనవిజ్ఞాన వేదిక జిల్లా అధ్యక్షుడు రమేష్ బాబు తదితరులు పాల్గొన్నారు.



నూతనకల్‌లో ప్రతిజ్ఞ చేయిస్తున్న కలెక్టర్ తేజస్ నంద్‌లాల్ పవార్

నగదు రహిత వైద్యసౌకర్యం కల్పించాలి

భానుపురి (సూర్యాపేట) : పెన్షనర్లకు నగదు రహిత వైద్య సౌకర్యం కల్పించాలని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ రిటైర్డ్ ఉద్యోగుల సంఘం ఉపాధ్యక్షుడు ఆర్.సీతారామయ్య ప్రభుత్వాన్ని కోరారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని సంఘం కార్యాలయంలో ఆయన మాట్లాడారు. 70 నుంచి 80 సంవత్సరాల వయసుగల పెన్షనర్లు మోకాళ్ల నొప్పులు, గుండె, కిడ్నీ, షుగర్ వ్యాధులకు లక్షల రూపాయలు ఖర్చు చేసి వైద్యం చేయించుకోలేకపోతున్నారన్నారు. పెన్షన్ నుంచి ఒక శాతం కాంట్రిబ్యూషన్ చెల్లిస్తామని, రాష్ట్ర ప్రభుత్వం ఒక శాతం విడుదల చేసి ఏదైనా ఒక ఇన్సూరెన్స్ కంపెనీతో అనుసంధానం చేసి నగదు రహిత వైద్య సౌకర్యం కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ప్రభుత్వ రిటైర్డ్ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు ఎస్‌సుదర్శన్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి టి.రాంబాబు పాల్గొన్నారు.

• కేంద్ర ప్రభుత్వ విధానాలపై నిరసన



కేంద్ర ప్రభుత్వ విధానాలను నిరసిస్తూ జిల్లా కేంద్రంలో బైక్‌ర్యాలీ నిర్వహిస్తున్న వివిధ కార్మిక సంఘాల నాయకులు
-భానుపురి (సూర్యాపేట)

ఫిర్యాదులపై సత్వరం స్పందించండి



షీ టీం పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఎస్పీ సన్‌ప్రీత్‌సింగ్, ఏఎస్పీ నాగేశ్వర్‌రావు, పోలీస్ అధికారులు

- ఎస్పీ సన్‌ప్రీత్‌సింగ్

సూర్యాపేటటౌన్ : ఫిర్యాదులపై సత్వరం స్పందించాలని ఎస్పీ సన్‌ప్రీత్‌సింగ్ పోలీస్ అధికారులను ఆదేశించారు. మంగళవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో పోలీస్ అధికారులతో ఎస్పీ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేసులు, ఫిర్యాదులు పెండింగ్ లేకుండా చూడాలని, కేసుల విషయంలో సమగ్ర దర్యాప్తు చేయాలని సూచించారు. నేరాల నియంత్రణ కోసం జిల్లావ్యాప్తంగా కార్డన్‌సెర్చ్, పెట్రోలింగ్, పోలీస్ బీట్స్ నిర్వహించాలన్నారు. కళాశాలల్లో యాంటీ ర్యాగింగ్ కమిటీలు ఏర్పాటు చేయాలని, ర్యాగింగ్ నిరోధక చట్టాల గురించి విద్యార్థుల్లో అవగాహన కల్పించాలన్నారు. సైబర్ మోసాల బారిన పడకుండా ప్రజలు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. అనంతరం మహిళల భద్రతకు సంబంధించి షీ టీం అవగాహన పోస్టర్‌ను ఎస్పీ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీలు నాగేశ్వర్‌రావు, జనార్దన్ రెడ్డి, డీఎస్పీ రవి, సైబర్ సెక్యూరిటీ డీఎస్పీ శ్రీనివాసరావు, ఏఆర్ డీఎస్పీ నర్సింహాచారి, స్పెషల్ బ్రాంచ్ ఇన్‌స్పెక్టర్ వీరరాఘవులు పాల్గొన్నారు.

గిరిజనుల భూముల పరిశీలన

మఠంపల్లి: మండలంలోని లాలితండాలో గిరిజనుల బీడు భూములను మంగళవారం జలవనరుల శాఖ జిల్లా అధికారుల బృందం పరిశీలించింది. ఈ సందర్భంగా జల వనరుల శాఖ జిల్లా అధికారి కురుమయ్య మాట్లాడుతూ 2019లో లాలితండాకు చెందిన నిరుపేద గిరిజనులు బోర్‌వెల్ పథకం కోసం దరఖాస్తు చేసుకున్నారని తెలిపారు. త్వరలో అర్హులైన గిరిజనులకు 300 ఫీట్ల వరకు ఉచితంగా డ్రిల్లింగ్ చేయడంతోపాటు మోటార్ ఇస్తామని తెలిపారు. వారి వెంట జిల్లా సేవాలాల్ సేన అధ్యక్షుడు బాలునాయక్ ఉన్నారు.



భూములు పరిశీలిస్తున్న అధికారులు

ధాన్యం కాంటాల్లో జాప్యం చేయొద్దు

- అదనపు కలెక్టర్ రాంబాబు



ధాన్యాన్ని పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్

కోదాడరూరల్ : కొనుగోలు కేంద్రాలకు వచ్చిన ధాన్యం నిబంధనల ప్రకారం ఉంటే జాప్యం చేయకుండా వెంటనే కాంటా వేయాలని అదనపు కలెక్టర్ రాంబాబు నిర్వాహకులకు సూచించారు. మంగళవారం కోదాడ మండల పరిధిలోని నల్లబండగూడెం ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో 313 ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి ధాన్యం సేకరిస్తున్నట్లు తెలిపారు. ఆయన వెంట ఆర్డీఓ సూర్యనారాయణ, తహసీల్దార్ వాజీద్‌అలీ, డీటీసీఎస్ రాంరెడ్డి ఉన్నారు.

రాజ్యాంగంలోని మౌలిక అంశాలను అధ్యయనం చేయాలి

రాజ్యాంగంలోని మౌలిక అంశాలను విద్యార్థులు అధ్యయనం చేయాలని అదనపు కలెక్టర్ రాంబాబు సూచించారు. రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా కోదాడ మండలంలోని దోరకుంట జెడ్పీ పాఠశాలలో విద్యార్థులతో ఆయన ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం ప్రజాపాలన విజయోత్సవాల్లో పాల్గొని గ్రామ పంచాయతీ సిబ్బందిని సన్మానించారు. ఆర్డీఓ సూర్యనారాయణ, తహసీల్దార్ వాజీద్‌అలీ, ఎంపీడీఓ రాంచందర్‌రావు, ఎంపీఓ పాండురంగన్న, హెచ్‌ఎం లింగారెడ్డి తదితరులు ఉన్నారు.

ఘనంగా ప్రజాపాలన ప్రజా విజయోత్సవాలు



మునగాలలో ప్రతిజ్ఞ చేస్తున్న అధికారులు

మునగాల: ప్రజాపాలన ప్రజా విజయోత్సవాలను మంగళవారం అధికారులు మునగాల మండలంలో ఘనంగా నిర్వహించారు. మండలంలోని బరాకత్ గూడెం, ఆకుపాముల, ముకుందాపురం గ్రామాల్లో నిర్వహించిన కార్యక్రమాలకు పంచాయతీరాజ్ రూరల్ డెవలప్‌మెంట్ జాయింట్ కమిషనర్ శేషుకుమార్, జెడ్పీ డిప్యూటీ సీఈఓ డి.శిరీష ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ముందుగా రాజ్యాంగ దినోత్సవాన్ని పురస్కరించుకుని అధికారులతో ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం బరాఖత్‌గూడెం గ్రామపంచాయతీలో నర్సరీ, గ్రూపు ఆఫ్ హార్వెస్టింగ్ స్ట్రక్చర్స్‌ను వారు ప్రారంభించారు. ముకుందాపురం పరిధిలో పశువుల కొట్టం నిర్మాణ పనులకు వారు శంకుస్థాపన చేశారు. ఆయా కార్యక్రమాల్లో ఎంపీడీఓ కె.రమేష్ దీనదయాళ్, తహసీల్దార్ వి.ఆంజనేయులు, ఏపీఓ శైలజ, ఈసీ కళ్యాణ్, నాగరాజు, పంచాయతీ కార్యదర్శి శ్వేత, పాల్గొన్నారు .

ఇష్టారాజ్యంగా ఇసుక తవ్వకాలు

పాలేరు వాగును తోడేస్తున్న ఇసుక వ్యాపారులు
- వాగు నుంచే నేరుగా అక్రమ రవాణా
- రాజకీయ ఒత్తిళ్లతో పట్టించుకోని అధికారులు
- అడ్డుకోవాలంటున్న వివిధ గ్రామాల ప్రజలు



ఈ చిత్రం కోదాడ మండల పరిధిలోని మంగలి తండా శివారులో అక్రమంగా డంప్ చేసిన ఇసుక. ఈ ఇసుకను మండల పరిధిలోని పాలేరు వాగు నుంచి అనుమతులు లేకుండా రాత్రి వేళ గుట్టుచప్పుడు కాకుండా తవ్వి తీసుకొచ్చి ఇక్కడ డంపింగ్ చేశారు. టిప్పర్లు, ట్రాక్టర్ ట్రక్కుల చొప్పున పట్టణ ప్రాంతాల వారికి అమ్మేందుకు ఇలా లోడ్ చేసి తరలిస్తున్నారు. ఈ తంతు కోదాడ నియోజకవర్గ పరిధిలోని మోతె, అనంతగిరి, కోదాడ మండలాల్లో నిత్యకృత్యంగా మారినా ఎవరూ నిలువరించలేని పరిస్థితి నెలకొంది.


కోదాడ రూరల్: కోదాడ నియోజకవర్గ పరిధిలోని మోతె, అనంతగిరి, కోదాడ మండలాల పరిధిలో పాలేరు వాగులోంచి ఇసుకను అక్రమంగా తోడేస్తున్నారు. ఈ ఏడాది కురిసిన భారీ వర్షాలకు వాగులో ఇసుక పెద్ద ఎత్తున మేటలు వేసింది. దీంతో వాగు పరీవాహక గ్రామాలకు చెందిన కొందరు వ్యాపారులు అనుమతులు తీసుకోకుండా ఇష్టానుసారంగా ఇసుకను తవ్వి ట్రాక్టర్లలో తరలిస్తూ యథేచ్ఛగా వ్యాపారం సాగిస్తున్నారు. ఇదివరకు అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్లను సీజ్‌చేసి వ్యాపారులపై పోలీసులు కేసులు నమోదు చేసినా వారిలో మార్పు రావడంలేదు.

అనుమతుల పేరుతో...

పాలేరు వాగు పరిధిలోని గ్రామాలకు చెందిన కొందరు ఇసుక మాఫియాగా ఏర్పడి ఏ పార్టీ అధికారంలోకి వస్తే ఆ పార్టీలోకి మారి ఇసుక అక్రమ వ్యాపారాన్ని కొనసాగిస్తున్నారు. వారు నియోజకవర్గంలోని పలు మండలాల్లో ప్రభుత్వ, అభివృద్ధి పనుల పేరుతో అనుమతులు తీసుకుంటున్నారు. ఆ అనుమతి పత్రాల్లో ఓ తేదీ నుంచి ఈ నంబర్ గల వాహనాల్లో ఇసుక రవాణా చేసుకోవచ్చని ఉంటుంది.. కానీ ఏ సమయంలో ఏ తేదీ వరకు తోలుకోవాలో మాత్రం ఉండదు. దీంతో ఆ పత్రాన్ని సాకుగా చూపి ఒకలోడ్ ప్రభుత్వ పనులకు తీసుకెళ్తే పదుల సంఖ్యలో లోడ్‌లను నెలల తరబడి రాత్రి పగలు తేడా లేకుండా వాగు నుంచి నేరుగా ట్రాక్టర్లు, టిప్పర్ల సహాయంతో గ్రామాలు, పట్టణాలకు తరలించి అమ్ముకుంటున్నారు. మరికొందరు వాగులోనుంచి తీసుకొచ్చిన ఇసుకను ఇతర గ్రామాల్లో డంపులు చేసి అవసరమైన వారికి టిప్పర్లు, ట్రాక్టర్లలో లోడ్ చేసి విక్రయిస్తున్నారు. ఒక్కో ట్రాక్టర్ ట్రక్కుకు రూ.5వేల వరకు అమ్ముతుండగా టిప్పర్ ఇసుకను రూ.25 వేల నుంచి రూ.30 వేల వరకు విక్రయిస్తున్నట్టు సమాచారం. పట్టించుకునే వారు ఎవరూ లేకపోవడంతో మోతె మండలంలోని ఉర్లుగొండ, నర్సింహాపురం, తుమ్మగూడెం, అన్నారిగూడెం.. అనంతగిరి మండలంలోని చనుపల్లి, పాలారం, మొగలాయికోట, కిష్టాపురం, శాంతినగర్, గోండ్రియాల, కొత్తగూడెం.. కోదాడ మండలంలోని మంగళితండా, నల్లబంగూడెం, రెడ్లకుంట గ్రామాల్లోని అక్రమ వ్యాపారులు యథేచ్ఛగా ఇసుక వ్యాపారం సాగిస్తున్నట్టు ఆరోపణలు వినిపిస్తున్నాయి.

చేతులెత్తేసిన అధికారులు

ఇసుక అక్రమ రవాణాలపై ఉక్కుపాదం మోపాల్సిన పోలీసు, రెవెన్యూ, మైనింగ్ అధికారులు ఆయా మండలాల్లోని రాజకీయ నాయకుల నుంచి వస్తున్న ఒత్తిళ్లతో ఏం చేయలేకపోతున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఇటీవల కోదాడ మండలంలో ఇసుక అక్రమ రవాణా చేస్తున్న ఓ గ్రామంలోకి ఓ శాఖ అధికారులు వెళ్లగా వారు మేము ఎవరో తెలుసా ఈ ఇసుక ఎక్కడికి వెళ్తుందో తెలుసా పైవారికి తెలిస్తే మీకే ఇబ్బంది అంటూ సదరు అధికారులను బెదిరించగా వారు చేసేదేమీ లేక వెనుదిరిగినట్లు విశ్వసనీయ సమాచారం. తమ అవసరాలకు ఇసుక దొరక్కుండా చేస్తూ.. అక్రమంగా వాగులోంచి తవ్వి అమ్ముకుంటున్న వ్యాపారులపై చర్యలు తీసుకోవాలని వాగు పరిధిలోని వివిధ గ్రామాల ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.



వాగులోంచి ఇసుకను తీసుకొస్తున్న ట్రాక్టర్

క్లుప్తంగా

నల్లగొండ డీఈఓపై ఏఎస్పీకి ఫిర్యాదు

నల్లగొండ క్రైం: నల్లగొండ జిల్లా విద్యాధికారి బొల్లారం భిక్షపతిపై ఆయన మొదటి భార్య మాధవి మంగళవారం ఏఎస్పీ రాములునాయక్‌కు ఫిర్యాదు చేశారు. తనకు విడాకులు ఇవ్వకుండానే డీఈఓ భిక్షపతి సునీత అనే మహిళతో వివాహేతర సంబంధం పెట్టుకుని ముగ్గురు పిల్లలను కన్నాడని, తనకు న్యాయం చేయాలని నల్లగొండ టూటౌన్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినప్పటికీ కేసు నమోదు చేయలేదని, కేసు నమోదు చేయకుండా నిర్లక్ష్యంగా వ్యవహరించిన టూటౌన్ ఎస్‌ఐపై చర్యలు తీసుకోవాలని ఆమె ఏఎస్పీని కోరారు. ఎస్‌ఐ తన పైనే అక్రమంగా కేసు నమోదు చేశారని తెలిపారు. విడాకుల పిటిషన్ కోర్టులో ఉండగా చట్ట విరుద్ధంగా వ్యవహరిస్తున్న డీఈఓ భిక్షపతిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఆమె కోరారు.

లైంగిక దాడిపై విచారణ

ఆత్మకూరు(ఎం): మండలంలోని రహీంఖాన్‌పేటలో సోమవారం బాలికపై లైంగిక దాడి జరిగిన ఘటనపై సీఐ ఎన్. వెంకటేశ్వర్లు విచారణ చేపట్టారు. మంగళవారం ఆయన గ్రామాన్ని సందర్శించి ఘటన జరిగిన ప్రదేశాన్ని పరిశీలించారు. బాలిక కుటుంబ సభ్యులతో మాట్లాడారు. ఆయన వెంట ఎస్‌ఐ ఎస్. కృష్ణయ్య ఉన్నారు.

అక్రమంగా తరలిస్తున్న ఆవుల పట్టివేత

- ఇద్దరిపై కేసు నమోదు

చౌటుప్పల్ రూరల్: బొలేరోలో అక్రమంగా తరలిస్తున్న ఆవులను మంగళవారం చౌటుప్పల్ పోలీసులు పట్టుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం కాకినాడ జిల్లా తుని నుంచి హైదరాబాద్‌లోని కబేళాకు బొలేరో వాహనంలో ఆవులను తరలిస్తుండగా.. చౌటుప్పల్ మండలం ఎల్లగిరి గ్రామ స్టేజీ వద్ద పోలీసులు పట్టుకున్నారు. వాహనంలో 11 ఆవులు, 4 ఎద్దులు ఉన్నట్లు పోలీసులు గుర్తించారు. వాహనం డ్రైవర్ ఆకునూరి రాజు, యాజమాని రాజుపై కేసు నమోదు చేసినట్లు సీఐ మన్మథకుమార్ తెలిపారు. పట్టుబడిన ఆవులను హైదరాబాద్‌లోని జియాగూడ గోశాలకు తరలించినట్లు పేర్కొన్నారు.

రెండు ఇళ్లలో చోరీ

మేళ్లచెరువు: మండల కేంద్రంలోని చౌదరిబజార్‌లో నివాసముంటున్న బొగ్గవరపు శ్రీను, సతీష్ ఇళ్లలో మంగళవారం గుర్తుతెలియని వ్యక్తులు చోరీకి పాల్పడ్డారు. పట్టపగలే ఇళ్ల తాళాలు పగులగొట్టి రూ.75వేల నగదు, ల్యాప్‌టాప్ ఎత్తుకెళ్లినట్లు బాధితులు పేర్కొన్నారు. పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించారు.

ఉపాధ్యాయ వృత్తి ఉన్నతమైంది


మాట్లాడుతున్న ఎమ్మెల్సీ నర్సిరెడ్డి

సంస్థాన్ నారాయణపురం: ఉపాధ్యాయ వృత్తి ఉన్నతమైందని ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి అన్నారు. సంస్థాన్ నారాయణపురం మండలంలోని జనగామ జిల్లా పరిషత్ హైస్కూల్‌లో గణిత ఉపాధ్యాయుడు నాగభూషణం ఉద్యోగ విరమణ కార్యక్రమానికి మంగళవారం ఆయన హాజరై నాగభూషణం, ఉమారాణి దంపతులను శాలువా కప్పి సన్మానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. విద్యా విధానంలో మార్పులు రావాలని ప్రభుత్వ పాఠశాలలు బలోపేతం చెందాలని దీనిపై ప్రభుత్వం తగిన విధంగా ఆలోచన చేయాలన్నారు. కార్యక్రమంలో చౌటుప్పల్ మున్సిపల్ చైర్మన్ వెన్‌రెడ్డి రాజు, ఎంఈఓ గోలి శ్రీనివాస్, పాఠశాల హెచ్‌ఎం కత్తుల ఉదయ, యూటీఎఫ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు మిర్యాల దామోదర్, ముక్కెర్ల యాదయ్య, రామకృష్ణారెడ్డి, చలపతిరెడ్డి, అనుముల శ్రీనివాస్, గాంధీ గుడి అర్చకుడు కూరెళ్ల నరసింహాచారి, కానుగుల వెంకటయ్య, మోటే సత్తయ్య, జంగయ్య, కిశోర్, మురళి, ఇంద్రసేనారెడ్డి తదితరలున్నారు.

సూర్యక్షేత్రంలో కార్తీకమాస వేడుకలు

అర్వపల్లి : మండల పరిధిలోని తిమ్మాపురం సూర్యక్షేత్రంలో మంగళవారం కార్తీకమాస వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలు ధ్వజస్తంభం వద్ద దీపాలు వెలిగించారు. అలాగే క్షేత్రంలో పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో క్షేత్ర వ్యవస్థాపకుడు, సూర్య ఆరాధకుడు జనార్దన్‌స్వామి, నరేష్, ఇంద్రారెడ్డి, అర్చకులు, భక్తులు పాల్గొన్నారు.


సూర్యక్షేత్రంలో దీపాలు వెలిగిస్తున్న మహిళలు

120 కిలోల డ్రగ్స్ పట్టివేత

- యాదగిరిగుట్ట మండలం రామాజీపేట పరిధిలోని కెమికల్ కంపెనీలో డ్రగ్స్ తయారీ
- కార్లలో ముంబైకి తరలిస్తుండగా గూడూరు టోల్ ప్లాజా వద్ద పట్టుకున్న పోలీసులు
- ముగ్గురి అరెస్ట్, పరారీలో మరో ముగ్గురు
- పట్టుబడిన డ్రగ్స్ విలువ రూ.25కోట్లు
- వివరాలు వెల్లడించిన డీసీపీ రాజేష్‌చంద్ర


పట్టుబడిన నిందితులను చూపుతున్న భువనగిరి డీసీపీ రాజేష్‌చంద్ర

భువనగిరి: సీజ్ చేసిన కెమికల్ కంపెనీలో డ్రగ్స్ తయారు చేసి ముంబైకి తరలిస్తున్న ముఠాను పోలీసులు అరెస్ట్ చేశారు. ఈ ఘటన యాదాద్రి భువనగిరి జిల్లాలో జరిగింది. మంగళవారం భువనగిరి డీసీపీ రాజేష్‌చంద్ర తన కార్యాలయంలో విలేకరులకు తెలిపిన వివరాల ప్రకారం.. యాదగిరిగుట్ట మండలం పెద్దకందుకూరు గ్రామానికి చెందిన భానుప్రసాద్, రామాజీపేట గ్రామానికి చెందిన వాసుదేవచారికి రామాజీపేట గ్రామ పరిధిలో శ్రీయాదాద్రి లైఫ్ సైన్సెస్ అనే కెమికల్ కంపెనీ ఉంది. ఈ కంపెనీ నిబంధనలకు విరుద్ధంగా ఉందని పొల్యూషన్ కంట్రోల్ బోర్డు మూడుసార్లు అనుమతి రద్దు చేసింది. భానుప్రసాద్ స్నేహితుడైన యాదగిరిగుట్ట మండలం చిన్నకందుకూరు గ్రామానికి చెందిన నేతి కృష్ణారెడ్డి రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తున్నాడు. అతడికి హైదరాబాద్‌లోని జీడిమెట్లకు చెందిన ఇస్మాయిల్‌తో పరిచయం ఏర్పడింది. ముంబైలో తనకు తెలిసిన వారికి డ్రగ్స్(ఎపిడ్రిన్, మెఫెడ్రోన్) కావాలని, తాను డ్రగ్స్ సరఫరా చేస్తానని, దీని ద్వారా డబ్బులు బాగా సంపాదించవచ్చని ఇస్మాయిల్ కృష్ణారెడ్డితో చెప్పాడు. కృష్ణారెడ్డి తన స్నేహితుడు భానుప్రసాద్‌కి విషయం చెప్పగా.. సీజ్ చేసిన తన కెమికల్ కంపెనీలో డ్రగ్స్ తయారుచేసేందుకు భానుప్రసాద్ ఒప్పుకున్నాడు. భానుప్రసాద్ తన భాగస్వామి అయిన వాసుదేవచారికి డ్రగ్స్ తయారు చేసే విషయం చెప్పడంతో అతడు కూడా అంగీకరించాడు. 10 సంవత్సరాలు కెమికల్ కంపెనీలో పనిచేసిన అనుభవం ఉన్న భానుప్రసాద్, కృష్ణారెడ్డి స్నేహితుడు సత్యనారాయణ కెమికల్ కంపెనీలో సింథటిక్ డ్రగ్స్ తయారీకి అవసరమైన ముడిసరుకును సమకూర్చుకుని డ్రగ్స్ తయారు చేయడం ప్రారంభించాడు. ముంబైకి చెందిన ఫైజాన్ అహ్మద్, ఇఫ్తార్ అహ్మద్ వద్ద పనిచేసే సల్మాన్ షేక్ డోలా హైదరాబాద్‌లోని జీడిమెట్లలో ఉండే ఇస్మాయిల్‌కు 100 కేజీల డ్రగ్స్ కావాలని ఆర్డర్ ఇచ్చాడు.

రెండు కార్లలో డ్రగ్స్ తరలిస్తుండగా..

ఆర్డర్ ఇచ్చిన డ్రగ్స్‌ను సోమవారం ముంబైకి తరలించేందుకు ప్రయత్నిస్తుండగా.. పక్కా సమాచారం మేరకు తెలంగాణ యాంటీ నార్కోటిక్ బ్యూరో పోలీసులు, రాచకొండ పోలీసుల బీబీనగర్ మండలం గూడూరు టోల్‌ప్లాజా, రైల్వే అండర్‌పాస్ వద్ద రెక్కీ నిర్వహించారు. అదే సమయంలో ముఠా సభ్యులు ఒక కారులో డ్రగ్స్, మరో కారు దానికి ఎస్కార్ట్‌గా వెళ్తుండగా.. రైల్వే అండర్‌పాస్ వద్ద పోలీసులు కార్లను ఆపి 100 కేజీల డ్రగ్స్‌ను స్వాధీనం చేసుకున్నారు. నేతి కృష్ణారెడ్డితో పాటు ముంబైకి చెందిన ఫైజాన్ అహ్మద్, కారు డ్రైవర్ సునీల్‌ను అరెస్ట్ చేశారు. వారి నుంచి రెండు కార్లతో పాటు నాలుగు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నట్లు డీసీపీ తెలిపారు. కెమికల్ కంపెనీ యాజమాని వాసుదేవచారి, భానుప్రసాద్‌తో పాటు ముంబైకి చెందిన సల్మాన్ షేక్ డోలా పరారీలో ఉన్నట్లు చెప్పారు. ఇస్మాయిల్ వద్ద 5 కేజీల డ్రగ్స్, కెమికల్ కంపెనీలో నిల్వ ఉంచిన మరో 15 కేజీల సింథటిక్స్ డ్రగ్స్, వాటి తయారీకి ఉపయోగించిన యంత్రాలు సీజ్ చేశామని డీసీపీ చెప్పారు. పట్టుబడిన డ్రగ్స్ విలువ రూ.25కోట్లు ఉంటుందని డీసీపీ పేర్కొన్నారు. ఈ కేసును ఛేదించిన తెలంగాణ యాంటీ నార్కోటిక్ బ్యూరో ఇన్‌స్పెక్టర్ రమేష్‌రెడ్డి, హెడ్‌కానిస్టేబుల్ జయరాజు, నవీన్, కానిస్టేబుళ్లు మధు, ఉదయ్‌ను డీసీపీ అభినందించారు. ఈ సమావేశంలో ఏసీపీలు రవికిరణ్‌రెడ్డి, చంద్రబాబు తదితరులు పాల్గొన్నారు.

యాదాద్రి లైఫ్ సైన్సెస్ కంపెనీలో సోదాలు

యాదగిరిగుట్ట రూరల్: రామాజీపేట గ్రామ పరిధిలోని యాదాద్రి లైఫ్ సైన్సెస్ కంపెనీలో భువనగిరి డీసీపీ రాజేష్ చంద్ర ఆధ్వర్యంలో సోమవారం రాత్రి యాదాద్రి భువనగిరి జిల్లా డ్రగ్ ఇన్‌స్పెక్టర్, ఏసీపీ రమేష్ కుమార్, యాదగిరిగుట్ట ఎస్‌ఐలు, సిబ్బంది కలిసి దాదాపుగా 20 మంది పోలీసులు సోదాలు జరిపారు. ఈ కంపెనీ రామాజీపేట పరిధిలో మొదట ప్రవాహా ల్యాబరేటరీస్ పేరుతో 2006లో ప్రారంభించారు. 2018లో వేరొకరు కంపెనీని తీసుకుని యాదాద్రి లైఫ్ సైన్సెస్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీగా పేరు మార్చారు. వెటర్నరీకి సంబంధించిన పలు రకాలైన డ్రగ్స్‌ను ఈ కంపెనీలో తయారు చేసేవారు. ఈ కంపెనీలో గతంలో 50 మంది వరకు పనిచేసేవారు. ప్రస్తుతం 30 మంది మాత్రమే పనిచేస్తున్నట్లు సమాచారం. ఇందులో తయారు చేసే డ్రగ్స్ కోడ్‌ల రూపంలో ఉంటాయని, ఎలాంటి డ్రగ్స్ తయారుచేస్తున్నారో తమకు తెలియదని వర్కర్లు చెబుతున్నారు.


కంపెనీలో సోదాలు నిర్వహిస్తున్న పోలీసులు

కష్టపడ్డాం.. కొలువు సాధించాం

ఇటీవల మేడ్చల్ జిల్లాలో ట్రైనింగ్ పూర్తిచేసుకున్న నల్లగొండ జిల్లాకు చెందిన పలువురు కానిస్టేబుళ్లు తమకు కేటాయించిన పోలీస్ స్టేషన్లలో పోస్టింగ్‌ల్లో చేరారు. పోలీస్ యూనిఫాం వేసుకోవాలనే కలను సాకారం చేసుకునేందుకు ఎంతో కష్టపడ్డామని, పట్టుదలతో చదివి కొలువు సాధించామని వారు తమ అభిప్రాయాలను సాక్షితో పంచుకున్నారు.

మా తల్లిదండ్రుల గౌరవం పెరిగింది



నా తల్లిదండ్రులు నన్ను కష్టపడి చదివించారు. తల్లిదండ్రుల కలను సాకారం చేస్తూ కానిస్టేబుల్ ఉద్యోగం సాధించాను. ప్రభుత్వ ఉద్యోగం రావడంతో సమాజంలో నా తల్లిదండ్రుల గౌరవం పెరిగింది.

– వంశీ, మదారిగూడెం, హాలియా

సంతోషంగా ఉంది



ఉద్యోగం రావడంతో నాతో పాటు నా తల్లిదండ్రులు, తోబుట్టువులు ఎంతో సంతోషంగా ఉన్నారు. కానిస్టేబుల్‌గా పనిచేస్తూనే ఉన్నత ఉద్యోగం సాధించేందుకు ప్రయత్నిస్తా. విధి నిర్వహణలో అంకితభావంతో పనిచేస్తాను.

– బీరం శివాజీ, శాలిగౌరారం

తల్లిదండ్రుల కల సాకారం చేశా



చిన్నప్పటి నుంచి నా తల్లిదండ్రులు నన్ను ఎంతో కష్టపడి చదివించి నా బంగారు భవిష్యత్‌కు బాటలు వేశారు. వారి కష్టం వృథా కానియ్యకుండా కానిస్టేబుల్ ఉద్యోగం సాధించి వారి కలను సాకారం చేశా.

– సీహెచ్. వెంకన్న, తొండల్‌వాయి, నార్కట్‌పల్లి

భార్య, అమ్మ ప్రోత్సాహంతోనే కానిస్టేబుల్ అయ్యాను



మా అమ్మ లక్ష్మి, భార్య ప్రియాంకతో పాటు కుటుంబ సభ్యుల ప్రోత్సాహంతోనే కానిస్టేబుల్‌గా ఎంపికయ్యాను. ట్రైనింగ్ మొదట్లో కొంత ఇబ్బంది పడినప్పటికీ నా భార్య, అమ్మ ప్రోత్సాహంతో క్రమశిక్షణతో అన్ని అంశాల్లో శిక్షణ పొందాను.

– తురక సందీప్, తడకమళ్ల, మిర్యాలగూడ

హత్య కేసులో ముగ్గురికి జీవిత ఖైదు

రామగిరి(నల్లగొండ): హత్య కేసులో ముగ్గురు నిందితులకు జీవిత ఖైదు విధిస్తూ నల్లగొండ ఎస్సీ, ఎస్టీ కోర్టు జడ్జి రోజారమణి మంగళవారం తీర్పు వెలువరించారు. ప్రాసిక్యూషన్ తెలిపిన వివరాల ప్రకారం.. కనగల్ మండలం కుమ్మరిగూడేనికి చెందిన మల్లికంటి వెంకటేశం నల్లగొండకు చెందిన ఎస్‌కే గౌస్‌కు రూ.3లక్షలు ఇవ్వాల్సి ఉంది. గౌస్ ఎన్నిసార్లు అడిగినా వెంకటేశం డబ్బులు ఇవ్వడం లేదు. ఇదే విషయమై పలుమార్లు పెద్ద మనుషుల మధ్య పంచాయితీ కూడా జరిగింది. ఈ క్రమంలో 2014 జూలై 8న డబ్బులు ఇస్తానని గౌస్‌కు వెంకటేశం చెప్పాడు. ఆ రోజు గౌస్ నల్లగొండకు చెందిన బొండా రవితో కలిసి వెంకటేశం ఇంటికి వెళ్లాడు. ఆ సమయంలో వెంకటేశం, అతడి భార్య శోభ, తండ్రి రాములు, తమ్ముడు యాదగిరి కలిసి గౌస్, రవి కళ్లల్లో కారం చల్లి కత్తులు, గొడ్డలి దాడి చేశారు. దీంతో గౌస్ అక్కడికక్కడే మృతిచెందాడు. రవి అక్కడి నుంచి పారిపోగా.. అతడిని వెంబడించి బలిజగూడెం వద్ద దాడి చేసి చంపారు. రవి అల్లుడు విద్యాసాగర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. అప్పటి డీఎస్పీ రాములునాయక్, సీఐ సుబ్బిరామిరెడ్డి, ఎస్‌ఐ పరమేష్, కోర్టు కానిస్టేబుల్ పోగుల శేఖర్‌గౌడ్ నిందితులను అరెస్ట్ చేసి కోర్టులో హాజరు పరిచారు. నిందుతుల్లో ఒకరైన రాములు మృతిచెందాడు. ఈ కేసు తుది తీర్పులో భాగంగా మంగళవారం పబ్లిక్ ప్రాసిక్యూటర్ అఖిల వాదనలతో ఏకీభవించిన నల్లగొండ ఎస్సీ, ఎస్టీ కోర్టు జడ్జి రోజారమణి నిందితులకు జీవిత ఖైదు, రూ.6 వేలు జరిమానా విధిస్తూ తీర్పు వెలువరించారు.

వ్యక్తిపై కత్తితో దాడి


ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న మునినాయక్

త్రిపురారం: పెద్ద మనుషుల సమక్షంలో పంచాయితీ పెట్టగా.. క్షణికావేశంలో ఓ వ్యక్తిపై మరో వ్యక్తి కత్తితో దాడి చేశాడు. ఈ ఘటన తిరుమలగిరి(సాగర్) పోలీస్ స్టేషన్ సమీపంలో మంగళవారం జరిగింది. సాగర్ సీఐ బీసన్న తెలిపిన వివరాల ప్రకారం.. తిరుమలగిరి(సాగర్) మండలం కీచ్యతండాకు చెందిన మోహన్ భార్యతో మునినాయక్ అనే వ్యక్తి తరచూ మాట్లాడుతుండగా.. మోహన్ అనుమానంతో తన భార్యతో తిరుమలగిరి పోలీస్ స్టేషన్‌లో మునినాయక్‌పై కేసు పెట్టించాడు. ఇదే విషయమై మంగళవారం తిరుమలగిరి పోలీస్ స్టేషన్ సమీపంలోని మార్కెట్ యార్డు వద్ద పెద్ద మనుషుల సమక్షంలో పంచాయితీ పెట్టగా.. మోహన్, మునినాయక్ మాట్లాడుకుంటున్నారు. ఈ క్రమంలో ఒక్కసారిగా మునినాయక్‌పై మోహన్ కత్తితో దాడికి పాల్పడ్డాడు. ఈ దాడిలో మునినాయక్‌కు వెన్ను, పొట్ట భాగంలో కత్తి పోట్లు పడ్డాయి. వెంటనే గమనించిన బంధువులు, పోలీసులు మునినాయక్‌ను ఆస్పత్రికి తరలించారు. నిందితుడు మోహన్ అదుపులోకి తీసుకొని విచారణ చేస్తున్నట్లు సీఐ బీసన్న తెలిపారు. తిరుమలగిరి(సాగర్) ఎస్‌ఐ వీరశేఖర్ పంచనామా నిర్వహించారు.

వృద్ధుడిని మోసం చేసి బంగారం చోరీ


బాధితుడి నుంచి వివరాలు తెలుసుకుంటున్న ఎస్‌ఐ రజనీకర్

ఆలేరురూరల్: వృద్ధుడిని మోసం చేసి అతడి వద్ద ఉన్న బంగారంతో ఇద్దరు దొంగలు ఉడాయించారు. ఈ ఘటన ఆలేరు పట్టణ కేంద్రంలో మంగళవారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మోటకొండూర్ మండలం అమ్మనబోలు గ్రామానికి చెందిన పులిగిల్ల బాలరాజు మంగళవారం హైదరాబాద్ నుంచి బస్సులో వచ్చి ఆలేరు పట్టణంలోని రైల్వే స్టేషన్ వద్ద దిగాడు. ఇంతలో ఇద్దరు గుర్తుతెలియని వ్యక్తులు అతడి వద్దకు వచ్చి తాము పోలీసులమని, ఇక్కడ దొంగలు పడ్డారని, ఒంటి మీద నగలు తీసి పేపర్‌లో పెట్టుకోమని చెప్పారు. దీంతో బాలరాజు తన వద్ద ఉన్న తులం బంగారం చైన్, రెండు ఉంగరాలు తీసి పేపర్‌లో పెట్టి జేబులో పెట్టుకుంటుండగా.. ఆ ఇద్దరు వ్యక్తులు ఒకసారి చెక్ చేస్తామని బాలరాజు నుంచి బంగారం తీసుకుని అప్పటికే తమ జేబులో ఉన్న రాళ్ల పేపర్‌లో పెట్టి బాలరాజు ఇచ్చారు. బాలరాజు పేపర్ తీసి బంగారాన్ని చూసుకునే లోపే ఇద్దరు దొంగలు అక్కడి నుంచి ఉడాయించారు. బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ రజనీకర్ తెలిపారు.

బియ్యం లోడు లారీని ఢీకొట్టిన మరో లారీ

- మంటలు చెలరేగి లారీ దగ్ధం

కోదాడరూరల్: రోడ్డు వెంట ఆగి ఉన్న బియ్యం లారీని మరో లారీ ఢీకొట్టడంతో మంటలు చెలరేగి దగ్ధమైంది. ఈ ఘటన హైదరాబాద్–విజయవాడ జాతీయ రహదారిపై కోదాడ మండల పరిధిలోని దోరకుంట శివారులో మంగళవారం తెల్లవారుజామున జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. బియ్యం లోడుతో వెళ్తున్న లారీ దోరకుంట శివారులో మరమ్మతుకు గురికావడంతో డ్రైవర్ రోడ్డు వెంట నిలిపివేశాడు. ఈ క్రమంలో మఠంపల్లి మండలం నుంచి వస్తున్న మరో లారీ వేగంగా వచ్చి బియ్యం లోడుతో వెళ్తున్న లారీని ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో బియ్యం లారీ రోడ్డు కిందకు దూసుకెళ్లి బోల్తా పడగా.. ప్రమాదానికి కారణమైన లారీలో మంటలు చెలరేగి దగ్ధమైంది.


దగ్ధమవుతున్న లారీ

విషయం తెలుసుకున్న ఫైర్ సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని మంటలు ఆర్పివేశారు. రెండు లారీల డ్రైవర్లు క్షేమంగా బయటపడ్డారు. లారీలోని బియ్యాన్ని సివిల్ సప్లై అధికారులు పరిశీలించి రేషన్ బియ్యం కాదని తేల్చారు. కాగా ఈ ఘటనపై తమకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని కోదాడ రూరల్ పోలీసులు తెలిపారు.

శాస్త్రోక్తంగా శ్రీలక్ష్మీనరసింహస్వామి నిత్యకల్యాణం


కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

మఠంపల్లి: మట్టపల్లి శ్రీలక్ష్మీనరసింహస్వామి క్షేత్రంలో శ్రీరాజ్యలక్ష్మి చెంచులక్ష్మి సమేత శ్రీ ప్రహ్లాద యోగానంద శ్రీలక్ష్మీనరసింహస్వామి నిత్యకల్యాణాన్ని అర్చకులు మంగళవారం శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో సుప్రభాతసేవ, నిత్యహోమం, మూలవిరాట్ స్వామికి పంచసూక్త విధానంలో పంచామృతాభిషేకం, ప్రత్యేక అర్చనలు చేశారు. అనంతరం నూతన పట్టు వస్త్రాలతో స్వామిఅమ్మవార్లను అందంగా అలంకరించి ఎదుర్కోళ్ల మహోత్సవ సంవాదం రక్తి కట్టించారు. కల్యాణతంతులో భాగంగా విశ్వక్సేనారాధన, పుణ్యాహవచనం, రుత్విగ్వరణం, రక్షాబంధనం, మధుపర్కపూజ, మాంగల్యధారణ, తలంబ్రాలతో అత్యంత వైభవంగా నిర్వహించారు. అదేవిధంగా క్షేత్రపాలకుడైన శ్రీఆంజనేయస్వామికి తమలపాకులతో ప్రత్యేక పూజలు చేశారు. వేడుకల్లో ఆలయ అనువంశిక ధర్మకర్తలు చెన్నూరు విజయ్‌కుమార్, మట్టపల్లిరావు, ఈఓ నవీన్‌కుమార్, అర్చకులు రామాచార్యులు, పద్మనాభాచార్యులు, లక్ష్మీనరసింహమూర్తి, ఫణిభూషణమంగాచార్యులు, ఆంజనేయాచార్యులు తదితరులు పాల్గొన్నారు.

రైతులకు ఇబ్బందులు లేకుండా కొనుగోళ్లు చేపట్టాలి

- ఎమ్మెల్సీ ఎంసీ కోటిరెడ్డి

త్రిపురారం: కొనుగోలు కేంద్రాల్లో రైతులకు ఇబ్బందులు తలెత్తకుండా ధాన్యాన్ని కొనుగోలు చేయాలని ఎమ్మెల్సీ ఎంసీ కోటిరెడ్డి అన్నారు. మంగళవారం నిడమనూరు మండలంలోని సూరెపల్లి, వెనిగండ్ల గ్రామాల్లో పీఏసీఎస్ ఆధ్వర్యంలోని ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడారు. రైతులు ఆరుగాలం కష్టపడి పండించిన పంటను కొనుగోలు కేంద్రాలల్లోనే విక్రయించుకోవాలని అన్నారు. కొనుగోలు కేంద్రాల్లో రైతులకు వసతులు కల్పించాలన్నారు. కార్యక్రమంలో వెనిగండ్ల పీఏసీఎస్ చైర్మన్ కేవీ రామారావు, రాంబాబు, పోలె డేవిడ్, సీఈఓ రాఘవరావు, రైతులు తదితరులు పాల్గొన్నారు.


ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్సీ ఎంసీ కోటిరెడ్డి

గుర్తుతెలియని వాహనం ఢీకొని వ్యక్తి మృతి

ఆత్మకూరు(ఎం): గుర్తుతెలియని వాహనం ఢీకొని వ్యక్తి మృతిచెందాడు. ఈ ఘటన ఆత్మకూరు(ఎం) మండలం కూరెళ్ల గ్రామంలో మంగళవారం సాయంత్రం జరిగింది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. కూరెళ్ల గ్రామానికి చెందిన మారుపాక వీరయ్య మృతిచెందడంతో మంగళవారం ఆయన అంత్యక్రియలు గ్రామంలో నిర్వహిస్తుండగా.. అదే గ్రామానికి చెందిన మారుపాక ఉప్పలయ్య(75) రోడ్డు పక్కన నిల్చున్నాడు. ఈ క్రమంలో గుర్తుతెలియని వాహనం వచ్చి ఉప్పలయ్యను ఢీకొట్టడంతో తీవ్రంగా గాయపడ్డాడు. చికిత్స నిమిత్తం అతడిని భువనగిరికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతిచెందాడు.

యువకుడి అదృశ్యం


రాజేష్

మిర్యాలగూడ టౌన్: మిర్యాలగూడ మండలం ఐలాపురం గ్రామానికి చెందిన యువకుడు అదృశ్యమయ్యాడు. మంగళవారం మిర్యాలగూడ రూరల్ ఎస్‌ఐ పిల్లి లోకేష్ తెలిపిన వివరాల ప్రకారం.. ఐలాపురం గ్రామానికి చెందిన బాణోతు శ్రీను కుటుంబంతో కలిసి చౌటుప్పల్ మండలం గుడిమల్కాపురంలో నివాసముంటూ సెంట్రింగ్ పనిచేస్తూ జీవనం సాగిస్తున్నాడు. శ్రీను పెద్ద కుమారుడు బాణోతు రాజేష్ (21) ఈ నెల 15వ తేదీన మిర్యాలగూడ మండలం వైసమ్మకుంటలో ఉంటున్న తన అమ్మమ్మ వద్దకు వెళ్తున్నానని చెప్పి ఇంటి నుంచి బయల్దేరాడు. రాజేష్ ఆ రోజు రాత్రి అమ్మమ్మ ఇంటి వద్దనే నిద్రించి 16వ తేదీ తెల్లవారుజామున వెళ్లిపోయాడు. అప్పటి నుంచి అతడి ఆచూకీ లభించడంలేదు. దీంతో రాజేష్ తండ్రి శ్రీను మంగళవారం మిర్యాలగూడ రూరల్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

లేబర్ కోడ్‌లను రద్దు చేయాలి


ప్రధాని నరేంద్ర మోదీ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న నాయకులు

భానుపురి: కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని అఖిల భారత ప్రగతిశీల వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర నాయకుడు పేర్ల నాగయ్య, జిల్లా అధ్యక్షుడు సయ్యద్ హుస్సేన్ డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ మంగళవారం సూర్యాపేట పట్టణంలోని శంకర్ విలాస్ సెంటర్‌లో అఖిల భారత ప్రగతిశీల వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో ప్రధాని నరేంద్ర మోదీ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ఏకపక్ష నిర్ణయాలతో ప్రజలను తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తోందని విమర్శించారు. కార్మిక, రైతు, ప్రజా వ్యతిరేక బడ్జెట్‌ను ప్రవేశపెట్టి ప్రజలపై విపరీతమైన భారం మోపిందని ఆరోపించారు. కార్యక్రమంలో సీపీఐ ఎంఎల్ జిల్లా కమిటీ సభ్యుడు కారింగుల వెంకన్న, పీఓడబ్ల్యూ జిల్లా ప్రధాన కార్యదర్శి కొత్తపల్లి రేణుక, పీడీఎస్‌యూ రాష్ట్ర సహాయ కార్యదర్శి ఎర్ర అఖిల్‌కుమార్, నాయకులు గొడ్డలి నరసన్న, చంద్రకళ, సంతోషిమాత, సూరం రేణుక, జయమ్మ, ఉపేందర్, జానయ్య, సాయబుస్సేన్, పద్మ తదితరులు పాల్గొన్నారు.

సీసీఐ కేంద్రానికి పోటెత్తిన ‘తెల్ల బంగారం’

- కిలోమీటరు మేరనిలిచిన పత్తి ట్రాక్టర్లు
- కొనుగోళ్లు వేగవంతం చేసిన అధికారులు
- ఇప్పటి వరకు 22,709 క్వింటాళ్లు కొనుగోలు


మాధారంకలాన్‌లోని టీఆర్‌ఆర్ కాటన్‌మిల్లు వద్ద బారులుదీరిన పత్తిలోడు ట్రాక్టర్లు

శాలిగౌరారం: మండలంలోని మాధారంకలాన్‌లో ప్రభుత్వం ఏర్పాటు చేసిన సీసీఐ కొనుగోలు కేంద్రానికి పత్తి (తెల్లబంగారం) పోటెత్తుతోంది. సీసీఐ(కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా) ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కేంద్రాన్ని ఈ నెల 6న తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేల్ ప్రారంభించారు. తొలుత తేమశాతం ఎక్కువగా నమోదు కావడంతో కొనుగోలు మందకొడిగా జరిగింది. ప్రస్తుతం నిర్ణీతస్థాయిలో తేమశాతం నమోదు కావడంతో సంబంధిత అధికారులు పత్తికొనుగోలును వేగవంతం చేశారు. పత్తికి ప్రభుత్వం రూ.7,520 మద్దతు ధర కల్పిస్తుండడంతో శాలిగౌరారం మండలంతోపాటు నకిరేకల్, అర్వపల్లి తదితర మండలాలకు చెందిన రైతులు సైతం వాహనాల్లో భారీగా పత్తిని తీసుకువస్తున్నారు. దీంతో మంగళవారం 365వ నంబర్ జాతీయ రహదారిపై సుమారు కిలోమీటరు మేర పత్తి లోడుతో వచ్చిన వాహనాలు నిలిచిపోయాయి.

844 మంది రైతుల నుంచి 22,709 క్వింటాళ్లు

శాలిగౌరారం మండల పరిధిలోని మాదారంకలాన్‌లో ఏర్పాటు చేసిన సీసీఐ కొనుగోలు కేంద్రం ద్వారా ఇప్పటివరకు 844 మంది రైతుల నుంచి 22,709 క్వింటాళ్ల పత్తిని కొనుగోలు చేశారు. పత్తి విలువ రూ. 16.50 కోట్లు ఉండగా అందులో 300 మంది రైతులకు రూ.5 కోట్లు వారి బ్యాంకు ఖాతాల్లో జమచేశారు.

శాలిగౌరారంలో 23వేల ఎకరాల్లో సాగు

శాలిగౌరారం మండల పరిధిలో దాదాపు 23 వేల ఎకరాల్లో రైతులు పత్తి పంటను సాగుచేశారు. వర్షాలు సకాలంలో కురువడంతో ఈసారి పత్తిసాగు ఆశాజనకంగా మారింది. వ్యవసాయశాఖ అధికారుల అంచనా ప్రకారం మండలంలో సుమారు 2లక్షల క్వింటాళ్లకు పైగా పత్తి దిగుబడులు వస్తాయని అంచనా వేశారు. సీసీఐ ఆధ్వర్యంలో పత్తి కొనుగోలు కేంద్రం కొంత ఆలస్యంగా ప్రారంభం కావడంతో అనేకమంది రైతులు ఇప్పటికే దళారులకు అమ్ముకున్నారు.

సీసీఐ కేంద్రంతో రైతులకు మేలు



మండలంలో సీసీఐ కేంద్రాన్ని ఏర్పాటు చేయడం వల్ల రైతులకు ఎంతో మేలు జరిగింది. మద్దతు ధర లభించడంతో రైతులకు ఏలాంటి నష్టం జరుగలేదు. చిన్నచిన్న సమస్యలే తప్ప కేంద్రంలో పత్తి కొనుగోలుకు అవాంతరాలు ఎదురుకాలేదు.

– కాసర్ల విద్యాసాగర్‌రెడ్డి, రైతు, పెర్కకొండారం

పడిగాపులు కాస్తున్నాం



ఐదెకరాలు కౌలుకు తీసుకొని పత్తిపంట సాగు చేశా. పత్తి అమ్ముకునేందుకు సీసీఐ కేంద్రానికి వస్తే ట్రాక్టర్లు అధికంగా ఉండటంతో క్యూలైన్‌లో మా ట్రాక్టర్ నిలిపాం. రెండు రోజులైనా మా ట్రాక్టర్ ఇంకా లోపలికి వెళ్లలేదు. రెండు రోజులుగా రోడ్డుపైనే పడిగాపులు కాస్తున్నాం.

– బొడ్డు సైదమ్మ, మహిళా కౌలురైతు, ఊట్కూరు

చేనేత సమస్యలు పరిష్కరించాలని వినతి


చేనేత, జౌళిశాఖ కమిషనర్ శైలజా రామయ్యర్‌కు వినతిపత్రం అందజేస్తున్న పోచంపలి చేనేత నాయకులు

భూదాన్‌పోచంపల్లి: చేనేత సమస్యలను పరిష్కరించాలని కోరుతూ మంగళవారం హైదరాబాద్‌లో రాష్ట్ర చేనేత, జౌళిశాఖ కమిషనర్ శైలజా రామయ్యర్‌తో పాటు ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు చిన్నారెడ్డిని పోచంపల్లికి చెందిన చేనేత నాయకులు వేర్వేరుగా కలిసి వినతిపత్రం అందజేశారు. చేనేత సహకార సంఘంలో పేరుకుపోయిన వస్త్ర నిల్వలను కొనుగోలు చేయాలని, నేత బజార్ సమస్యకు పరిష్కారం చూపి కార్మికులకు అప్పగించాలని విజ్ఞప్తి చేశారు. చేనేత సంక్షేమ పథకాలు ప్రతిఒక్కరికి అందేలా చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు ఏలే భిక్షపతి, గంజి కృష్ణ, భోగ నర్సింహ తదితరులు ఉన్నారు.